

# భక్తవత్సలం

మేదా మస్తాన్ రెడ్డి

ఈ మరపు రాని సంఘటన జరిగి పాతికేళ్ళయింది. ఉత్తమ సైనికుడిగా రాష్ట్రపతి అవార్డు అందుకుని పదవీ విరమణ చేసిన నాకు ఇప్పటికి ఏ అవసరం వచ్చినా " ఏమప్పా ఆలోచనేల. నాది తీసుకోప్పా" అనే మాటలు నా చెవిలో వినబడినట్లుంటాయి.

* * *

మా గ్రామానికి దగ్గరగా వున్న రైల్వే స్టేషన్ నుంచి తమిళనాడులోని 'వెల్లింగ్టన్'కి రైల్వే పాస్ ఇచ్చారు నన్ను ఎంపిక చేసిన మిలటరీ అధికారులు. రెండు జతల బట్టలు, కొన్ని పాత సినిమా పాటల పుస్తకాల కట్టలు మాత్రమే ఉన్న చిన్న ట్రంకు పెట్టెతో రైల్వే స్టేషన్నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే ఆర్మీ ట్రైనింగ్ సెంటర్‌కి సునాయసంగా చేరుకున్నాను. అమ్మానాన్నలకు ధైర్యం చెప్పి ఎంతోనిబ్బరంగా బయలు దేరిన నేను మిలటరీ క్యాంప్ సింహద్వారం చేరేటప్పటికి కొంత జంకిన మాట వాస్తవం. గేటులో ఉన్న జవాను నా లెటరు చూసి పేరు రాసుకుని ముద్రకొట్టి లోపలకి పంపాడు.

ఇనుపకండరాలు, ఉక్కునరాలు, వజ్రతుల్యమైన గుండె, అచంచలమైన దేశభక్తి లాంటివేమీ లేని నేను బెరుగ్గా లోపలకి అడుగుపెట్టాను. బయటకు కనిపించని విశాల మైదానంలో శిక్షణ కోసం ఏర్పాటు చేసిన వేలాడే లావుపాటి తాళ్ళు, కృత్రిమ గుహలు, పెద్ద పెద్ద సిమెంటు గుంతలు కనిపించాయి. పొడుగాటి సరుగుడు చెట్ల గుంపుల మధ్య శిక్షణ పొందుతున్న వాళ్ళు చేసే డ్రిల్లు, నోటితో పలికే వింత శబ్దాలు గుండెల్లో గుబులు పుట్టించాయి. వెనక్కి తిరిగి పోదామనిపించినా పియుసి చదువుకి పిలిచి ఉద్యోగం ఎవరిస్తారనిపించింది. ఇంటి బాధ్యతలు కూడా గుర్తొచ్చాయి. '' ఏదీ తనంత తానై నీ దరికి రాదు. శోధించి సాధించాలి అదే ధీరగుణం'' అన్న శ్రీశ్రీ పాటలోని చరణాలు నా చరణాలను ముందుకు నడిపాయి. ప్రతిపాదించిన బారెక్స్‌లో అప్పటికే నలభైమందికి పైగా నా వయసువాళ్ళు ఓ క్రమపద్ధతిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వాళ్ళ నెత్తి మీద అర అంగుళం పాటి జుట్టు కూడా లేదు.

ఇంతలో ఒక లావుపాటి నల్లనివాడు ఖాకి నిక్కరు కాలరు బనియనుతో వచ్చి కర్కశంగా 'డేయ్.. పోయి ముడి వెట్టికిడి వాడా' అన్నాడు. '' ఏమన్నారు?'' అన్నాను కీచుగొంతుతో. '' ఓహో! తెలుంగా? అని చులకన భావంతో నవ్వి వాళ్ళకేసి తిరిగి ''డేయ్ మీలో తెలుగు తెలిసిన వాడెవడో వీడిని తోడు తీసుకెళ్ళండి'' అరవంలో ఆదేశించి వెళ్ళిపోయాడు. బిత్తర చూపులు చూస్తూ నిలబడ్డాను.

''ఏమప్పా! నీపేరు ఏమి?'' ఒకడొచ్చి కుదుపుతూ అడిగాడు చెప్పాను.

''నాన్‌దాన్ భక్తవత్సలం. మా తాత వాండ్లు ఆంధ్రవాండ్లుదా. మా ఇంట్లో అంతా తెలుంగే మాట్లాడుతాము. నీకేమీ కవల లేదప్పాదా. బార్బర్ కాడికి పోయిడ్సి వద్దాం'' అంటూ చేయికలిపాడు. క్షురకర్మ అయ్యాక ఏదో ఆలోచిస్తుంటే '' ఏమప్పా! ఆలోచన?'' అడిగాడు. ''సబ్బు లేదు'' అన్నాను సిగ్గుతో. ''నాది వాడుకోప్పా'' అంటూ నా గుండెల్లో చోటు చేసుకున్నాడు.

ఆరు అడుగుల గోడ దూకడంలోనూ, తొమ్మిది అడుగుల గుంత దాటడంలోనూ, నాలుగు అడుగుల చెక్క గుర్రాన్ని గెంతడంలోనూ నేను పదే పదే విఫలమవుతుంటే రాత్రిళ్ళు ఆయాచోట్లకు తీసుకెళ్ళి మెళకువలు నేర్పి అభ్యాసం చేయించేవాడు భక్తవత్సలం. ట్రైనింగ్ పూర్తి అయ్యేవరకు నాకు కొండంత అండగా నిలబడ్డాడు. మా బ్యాచ్‌లో మూడు భాగాలు తమిళులు, ఒక భాగమే కేరళీయులు, కన్నడిగులు. తెలుగువాడ్ని నేనొక్కడ్నే కావడమూ, వయసులో చాలామంది కంటే చిన్నవాడ్ని అవడంతో అందరూ నన్ను ముద్దుగా ''తెలుంగు బాబు'' అని పిలిచేవాళ్ళు. నాకు తమిళం పూర్తిగా అలవాటయి ఆ భాషలో పాటలు పాడేస్థాయికి వచ్చాక కూడా నేనూ భక్తవత్సలం తెలుగే మాట్లాడుకునేవాళ్ళం.

* * *

ఆరోజే క్లోజింగ్ పెరేడ్. అందరం బెటాలియన్ ఆఫీసు బయట మూడు వరుసల్లో నిలబడి ఉన్నాం. శిక్షణ పూర్తయి రిక్రూట్ నుండి సిపాయిగా మారినందుకు సంతోషం, పోస్టింగ్‌లు ఏ ప్రాంతానికి వేస్తారో అనే కుతూహలం, మళ్ళీ ఒకరినొకరం కలుసుకుంటామో లేదోననే ఉద్వేగం, ఇప్పుడిచ్చే నెల రోజుల సెలవుల్లో చాలా కాలం తర్వాత స్వంత ఊరికి వెళ్తున్నామనే ఆనందాలతో మా అరవైమంది ముఖాలు రంగులు మార్చుకుంటున్నాయి. ఆసక్తిగా కమీషన్డ్ ఆఫీసర్ చదివే పోస్టింగ్ లిస్టును వింటున్నాము. భక్తవత్సలాన్ని కాశ్మీరులో ఉండే ఒక రెజిమెంట్‌కి వేశాడు. మరో తొమ్మిది పేర్లు చదివాకే నాపేరు వస్తుంది. ఏ భూటాన్ బార్డర్‌కో, అస్సాం అంచులకో విసిరేస్తారేమోననే దిగులు చెందిన నా మొర ఏ దేవుడు ఆలకించాడో గానీ, నన్ను భక్తవత్సలాన్ని వేసిన రెజిమెంటుకే పోస్టింగ్ చేశారు.

* * *


ఆ రాత్రి వెల్లింగ్టన్ రైల్వే ప్లాట్‌ఫామ్ మా పెద్ద ట్రంకు పెట్టెలతో మా బూట్ల కటకటలతో, మా కన్నీళ్ళ ఆలింగనాలతో, హాస్యోక్తులతో, సిగరెట్ పొగలతో నిండిపోయింది. పార్దిపన్ వచ్చి నా చేతులు పట్టుకుని క్షమాపణ కోరాడు. ఏదో దొంగలించాడని తెలిసి వాడితో నేను రెండు నెలలుగా మాట్లాడటం లేదు. వాడ్ని హత్తుకున్నాను. పెద్ద తప్పు చేసి నా చేత దెబ్బలు తిని అలిగి వున్న డేవిడ్‌ని క్షమించమని గడ్డం పట్టుకున్నాను. పెద్దగా ఏడ్చేశాడు. నేను కొట్టినప్పుడు కూడా తిరగబడ్డాడు కానీ అంతలా ఏడ్వలేదు. చలించిపోయాను. కన్నీరు ఆపుకోలేక పోయాను. నెల తర్వాత మళ్ళీ ఎలాగూ కలుస్తాం కదా అనే సందేశాన్నిచ్చే కరచాలనం చేసాను భక్తవత్సలంతో.


రైలు వచ్చేంతవరకు ఒకరినొకరు వదలక కబుర్లు చెప్పుకుంటూనే ఉండిపోయాము.

* * *

హిందీ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేని భక్తవత్సలం కంటే ముందుగా నేను నాయక్ అయ్యాను. రెజిమెంటులో పగలు మాకేమీ పని ఉండేది కాదు. రాత్రిళ్ళు పెట్రోలింగ్‌కి వెళ్ళాల్సి వచ్చేది. అలవాటు లేని చలి. ఉన్నిదుస్తులైనా నాభినుండి పుట్టే వణుకుకి విరుగుడుగా అలవాటైన 'మందు' భక్తవత్సలం మందలించే స్థాయికి ఎదిగి ఆగిపోయింది. ఒక రాత్రి పహరాలోనె వ్రూ లేక్ పక్కన ఒక వీధిలో ఉగ్రవాదులు బీభత్సం సృష్టించి వెళ్ళారని కబురందింది. బుల్లెట్ వేగంతో మా ప్లాటూన్‌తో ఆ ఇంటికి వెళ్ళిన నాకు ఎంతటి పాషాణ హృదయమైనా కరిగిపోయే దృశ్యం కనబడింది. ఆ కిరాతకులు ఆరేళ్ళ వాళ్ళ కొడుకుని నిద్రలోనే కాల్చి చంపారు. భయపడి గోధుమల డబ్బాలో దాగిన ఆ ఇంటి యజమానిని దాన్లోనే నడినెత్తి మీద కాల్చి ప్రాణం తీశారు. పదేళ్ళ కూతురు బెదురు చూపులతో తల్లిని వాటేసుకుని ఉంది. అతని భార్య తల్లి ఏడుపుల మధ్య చెప్పిన మాటలు కడుపుని ఇంకా కెలికి వదిలాయి.

''మమ్మల్ని కూడా చంపండి'' అని ఎంత బతిమాలినా ఆ రాక్షసులు వినలేదట. ఇంకా క్రూరంగా






నవ్వుతూ "మేం వెళ్ళాక మీ ఆర్మీబద్మాష్ గాళ్ళు వస్తారు. మా తడాఖా వాళ్ళకు చెప్పాలనే మిమ్మల్ని వదిలేస్తున్నాం. అయినా ఆడవాళ్ళను చంపకూడదని మా మాలిక్ భయ్యా చెప్పాడు. ఖాళీ చేసి వెళ్ళండి. కాశ్మీరు మాది. ఆ..." ఇంకేమీ వినదల్చుకోలేదు. అంబులెన్స్ కోసం కబురు పెడదామనుకుంటుండగా అది వచ్చి వుందని ఎదురుగా ఉన్న భక్తవత్సలం చెప్పాడు.

* * *

అంబులెన్స్‌ను బేస్ హాస్పిటల్‌కి పంపి చిన్నట్రక్కులో వస్తుండగా దూరంగా పెద్ద పేలుడు వినిపించింది. మూడు నిమిషాల్లో ఆ విస్ఫోటనం జరిగిన చోటుకి చేరాము. లాండ్‌మైన్ పెట్టి రేషన్ తీసుకెళ్ళే మిలటరీ ట్రక్కును పేల్చేశారు. ఇద్దరు జవాన్లు ముక్కలై పడి ఉన్నారు. మూలుగుతూ ఉన్న సర్దార్ జీ డ్రైవర్‌ను స్ట్రెచర్ మీద పడుకోబెట్టి మా బండిలో ఎక్కిస్తుండగా అతను స్పృహలోకొచ్చి "మేరా బహ్ నీ చేర హగయా" అని పంజాబీలో గొణిగాడు. ఐడెంటిటీ కార్డు, మెడలో వేలాడే అల్యూమినియం డిస్కు తడిమాను. అవి కాదని తల అడ్డంగా ఊపాడు. పాంటు జేబులో పర్సుకూడా ఉందని చెప్పాను. ఏదో సైగ చేసాడు. అప్పుడు చూసాను. అతని ఎడమ మోకాలి కింది భాగం లేదు. వెంటనే భక్తవత్సలం వెళ్ళి దూరంగా పడి ఉన్న అతని బూటు కాలుని వెతికి తెచ్చి అతనికి చూపాడు. సర్దార్ జీ చిరునవ్వుతో కోమాలోకి జారుకున్నాడు. తక్షణ వైద్య సహాయం అందడంతో అతనికి పునర్జన్మ లభించింది.

* * *

దేశంలో పరిస్థితి మామూలుగానే ఉన్నా సరిహద్దుల్లో మాత్రం సైన్యం ఎప్పుడూ అప్రమత్తతతో ఉంటుంది. బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత సైనికులు మరణించలేదనుకునే సామాన్య ప్రజానీకానికి ప్రతి రోజూ బార్డర్‌లో ఎదురు కాల్పులు జరుగుతూంటాయని తెలియదు. ఆ కవ్వింపు కాల్పుల్లో నిత్యమూ ఒకరో ఇద్దరో, ఆవైపో, ఈ వైపో తూటాలకు బలి అవుతూంటారు. అది మీడియాకు అందదు. బయటకు పొక్కదు. ఆ సంవత్సరం వంతు ప్రకారం మా రెజిమెంట్ ఫార్వార్డ్‌లో ఉంది. హవల్దార్ అయిన నేనూ, నాయక్ భక్తవత్సలం, లాన్స్ నాయక్ గన్నర్ తంగవేలు ఒక బంకర్‌లో పొజిషన్‌లో ఉన్నాం. ఆగి ఆగి తుపాకీల మోత గ్రైనేడ్ శబ్దాలు వినిపిస్తున్నాయి.

భక్తవత్సలం హుషారుగా చెప్పాడు "ఏమప్పా. మనతో ట్రైనింగ్ చేశాడే కన్నన్. మన రెజిమెంటుకే పోస్టింగ్ వచ్చేడ్సిందంట. చార్లీ ప్లాటూన్‌తో ఉన్నాడంట"

"ఇద్దరు కన్నన్‌లు ఉండేవాళ్ళు. ఒకడేమో సీనియర్ కన్నన్. డ్రైవర్ ట్రేడు"

"వాండు కాదప్పా కర్రికన్నన్ అని పిలస్తా ఉంటివిదానే. వాండు"

"ఓహో 888 కన్ననా" ఆర్మీనెంబరులోని చివర మూడు అంకెలతో కొందరిని పిలుచుకునే వాళ్ళు. "ఆ...గుర్తొచ్చాడు. ఈ ఎక్సర్‌సైజు అయింతర్వాత కలుద్దాం" అన్నాను నవ్వుతూ.

"నోరుముయ్యప్పా. పది ఏడాదిల తర్వాత ఫ్రెండు వచ్చి ఉండాండు. అదీ మూడో బంకరులో. నాకు ఇప్పుడే చూడాలని ఉందప్పా" చిన్నపిల్లాడు మారాం చేసినట్లు అంటూ ఇసుక బస్తాల పక్క నుండి చూస్తున్నాడు.

"వద్దురా. డేంజర్" బైనాక్యులర్‌తో చూస్తూ వారించాను.

అంతా నిర్మానుష్యంగా ఉంది. ఎక్కడో చిన్న అలికిడి అయినట్లయింది. "అప్పా.. డేంజర్" అంటూ భక్తవత్సలం ప్రక్కకి లాగాడు. సరిగ్గా అప్పుడే ఎక్కడనుండో వచ్చిన ఫిరంగి గుండు అతి సమీపాన పేలింది. రెప్పపాటు కాలంలో ఒక షెల్లింగ్ వచ్చి భక్తవత్సలం భృకుటిలో దిగింది. "అప్పా" అని అరచి వాడు నా మీదకి ఒరిగి కన్ను మూసాడు. మావైపునుండి మిషన్ గన్స్ గర్జించాయి. వెనకనుండి టాంకర్ ఫైరింగ్‌తో మా వాళ్ళు చాకచక్యంతో ఎదుర్కొన్నారు. కాల్పులు ఆగాయి. నా పంచేంద్రియాలు పనిచేయడం లేదు. కర్తవ్యం గుర్తొచ్చి నన్ను నేను బలవంతం మీద సముదాయించుకుని వైర్‌లెస్ సెట్‌లో కెప్టెన్‌కు కబురందించాను. బ్రిగేడ్ కమాండర్ ఆదేశం ప్రకారం ప్రస్తుతం ఏ కదలికలూ ఉండకూడదనీ 'సీజ్ ఫైర్' అయిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటానన్నాడాయన. వణికే చేతులతో భక్తవత్సలం హెల్మెట్ తొలగించి నా 'హవర్ సాక్' లోని బ్యాండేజీతో గట్టిగా కట్టుకట్టాను. రక్తపు మరకల్ని నీళ్ళతో కడిగాను. నేను ఏడిస్తే లాన్స్‌నాయక్ తంగవేలు భయపడతాడు.

"భగవాన్! ఈ పరిస్థితి పగవాడిక్కూడా వద్దు" అనుకుంటూ నిలబడ్డాను.

ఆ చిన్న బంకర్‌లో రాత్రి వరకు చలనం లేని నా భక్తవత్సలంతో గడపాలి. డ్యూటీ చేయాలి.

* * *

మధ్యాహ్నం పన్నెండయింది. తంగవేలుని పౌచస్‌లో వున్న పూరీ పంచదార కలిపి తినమన్నాను. అతను అయిష్టంగానే ఆ పని చేసాడు. నేను మాత్రం నీటితోనే కడుపు నింపుకున్నాను. సాయంత్రం నాలుగు గంటలకు నా కళ్ళు తిరుగుతున్నట్లనిపించాయి. నా అవస్థ చూసిన తంగవేలు "కాస్త చక్కెర అయినా నోట్లో వేసుకోండి సార్" అని సలహా ఇచ్చాడు. చిన్న ప్లాస్టిక్ కవరులోని పంచదార పిడికెడు నోట్లో వేసుకున్నాను. శుభవార్త విన్న తర్వాత నోరు తీపి చేసుకోవడం ఆనవాయితీ. అటువంటిది ప్రాణమిత్రుడు ప్రాణం పోయి పడి వుంటే ఈ దుస్థితి ఏమిటి? కన్నీళ్లు ఆగడం లేదు. చక్కెర గొంతుకు అడ్డం పడింది. వాటర్ బాటిల్ చూసుకున్నాను. చుక్క నీళ్ళే మిగిలాయి. తంగవేలు బాటిల్‌లోనూ అయిపోయాయి. గొంతు పట్టినట్లుగా వుంది. బలవంతంగా లాలాజలాన్ని చప్పరిస్తున్న నా చెవిలో రహస్యంగా ఎవరో పలికినట్లయింది.

"ఏమప్పా. ఆలోచన. నా వాటర్ బాటిల్‌దా వుంది. తీసుకోప్పా" సందేహం లేదు. అది భక్తవత్సలం గొంతే. వాడికేసి చూసాను. నిశ్చింతగా నిద్రపోతున్నట్లున్నాడు. ఇదేం మాయ? అప్పుడు గుర్తొచ్చింది వాడి వాటర్ బాటిల్ విషయం. మనసు రాయి చేసుకుని భక్తవత్సలం శరీరాన్ని ఒక పక్కకి తిప్పి నడుముకి వెనక బెల్టుకి వున్న బాటిల్ విప్పి రెండు గుటకలు తాగాను. మూడో గుటక వేస్తుండగా బాధతో పొలమారింది. బతికినన్నాళ్ళూ స్నేహం కోసం పరితపించాడు. పోయే ముందు ఒక స్నేహితుడ్నిచూడాలని తపించాడు. ప్రాణం పోయాక కూడా ప్రాణ స్నేహితుడి దాహానికి నీళ్ళిచ్చాడు. ఇక దుఃఖాన్ని ఆపుకోలేక పోయాను. పెద్దగా ఏడుస్తూ భక్తవత్సలం కాళ్ళమీద పడిపోయాను.

★